బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటువేస్తే కష్టాలు తప్పవు

మనోహరాబాద్‌లో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి, నవంబర్ 14 : బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ప్రజలకు కష్టాలు తప్పవని, బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఉన్న ఆసరా పింఛన్‌ను రూ.200 నుంచి రూ.2016 వరకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మండలంలోని చందామయభాగ్, పడకల్, మనోరాబాద్, తొర్లికొండ, సంతోష్‌నగర్, కొలిప్యాక్, చింతలూరు, కలిగోట, జక్రాన్‌పల్లి, వివేక్‌నగర్ తండాతోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ రూరల్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు నియోజకవర్గం ఏవిధంగా ఉందో, ప్రస్తుతం ఎలా ఉందో ఒకసారి ప్రజలు ఆలోచించాలని కోరారు. గడపగడపకూ సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కారు గుర్తుకే ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని సూచించారు. రాష్ట్రంలో 24 గంటలు కరెంట్ సరఫరా చేస్తే.. రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంట్ సరిపోతుందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేసుకోవడంతోపాటు రేషన్ కార్డుపై సన్నబియ్యం, రూ. 5 లక్షల కేసీఆర్ బీమా, మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద రూ.3 వేలు, రూ.400కే వంటగ్యాస్, పెన్షన్ పెంపు తదితర వాటిని పొందవచ్చని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ మాయమాటలేనని, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రస్తుత పాలనలో మోసపోయిన ప్రజలే ఇందుకు నిదర్శనమని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే ఏడు గంటల కరెంట్ సరఫరాను 10 గంటలకు పెంచుతామని హామీనిచ్చి.. ఐదు గంటలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని తెలిపారు. పొద్దున, రాత్రి కరెంట్ ఇస్తూ మళ్లీ పాత రోజులను కాంగ్రెస్ గుర్తు చేస్తున్నదని అన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. పడకల్‌లో 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి పడకల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తానని అన్నారు. ఆయా గ్రామాల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌కు మహిళలు మంగళహారతులు, బోనాలతో ఘనస్వాగతం పలికారు.

వీజీగౌడ్ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో ఎక్కడ నిలబడినా గెలిచే వ్యక్తి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉండే నాయకుడు బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ఎంపీపీ కుంచాల విమలారాజు, జడ్పీటీసీ తనూజా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముస్కు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నట్ట భోజన్న, రైతుబంధు సమితి మండల కన్వీనర్ డీకొండ శ్రీనివాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, సర్పంచులు చేతనా విజయ్‌రెడ్డి, సుకన్యాప్రసాద్, బాలయ్య, అక్కపత్రి సురేశ్, జక్కం చంద్రకళా బాలకిషన్, ధూళీబాయి, సొసైటీ చైర్మన్లు ఆర్మూర్ గంగారెడ్డి, శ్రీనివాస్, ఎంపీటీసీలు జయాగిరిధర్ గౌడ్, గంగారెడ్డి, సంకెపల్లి పద్మ, సతీశ్, మాజీ జడ్పీటీసీ సూర్యసురేశ్ (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, రాజుతోపాటు పలువురు జడ్పీటీసీ తనూజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– జక్రాన్‌పల్లి, నవంబర్ 14

బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం

గుండారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజామాబాద్ రూరల్, నవంబర్ 14 : బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. మండలంలోని గుండారంలో జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి, పార్టీ రూపొందించిన మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంచుతూ.. కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ సుపరిపాలనతోనే అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ అంకల గంగాధర్, సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు పోతన్న, జమీర్‌ఖాన్, అబ్దుల్ ఖదీర్, దాసరి ఒడ్డెన్న, ఉమాపతి పాల్గొన్నారు.

బాజిరెడ్డికి మద్దతుల వెల్లువ

బాజిరెడ్డికి మద్దతు పలుకుతున్న మహాలక్ష్మీనగర్, పాంగ్రా బ్యాంకు కాలనీవాసులు

నిజామాబాద్ రూరల్/ సిరికొండ, నవంబర్ 14 : బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు రూరల్ నియోజకవర్గంలోని వివిధ సంఘాలు, గ్రామాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. రూరల్ మండలంలోని పాంగ్రా బ్యాంకు కాలనీ, మహాలక్ష్మీనగర్ వాసులు బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆయన నివాసంలో మంగళవారం కలిసి మద్దతు తెలిపారు. సిరికొండ మండలం తూంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఎంపీపీ సంగీతా రాజేందర్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, మైనార్టీ విభాగం అధ్యక్షుడు గౌసొద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ కులసంఘాలు, వీడీసీ, గ్రామస్తులు బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేస్తామని తీర్మానం చేశారు.

లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు

మోపాల్ (ఖలీల్‌వాడి),నవంబర్ 14 : మండలంలోని బోర్గాం(పీ) గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి మహాలయంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబసమేతంగా మంగళవారం పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ దంపతులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమలలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు.

హోమం నిర్వహిస్తున్న బాజిరెడి గోవర్ధన్, జగన్ దంపతులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

జిల్లా బాలికల జట్టును అభినందిస్తున్న డీఐఈవో రఘురాజు

డిచ్‌పల్లి, నవంబర్ 14 : స్కూల్ గేమ్స్ అండర్-19 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచింది. నవీపేట్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో డీఐఈవో రఘురాజు క్రీడాకారిణులను అభినందించారు. విద్యార్థి దశలో క్రీడల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాగ లత, ఎస్జీఎఫ్ అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.గంగాధర్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.మల్లేశ్ గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, రీజినల్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పి.నీరజారెడ్డి, ఉదయశీల, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోత్స్న పి.మానస, సుజాత పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు సాగాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్ రూరల్, నవంబర్ 14 : విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు సాగాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని గూపన్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి ప్రత్యేక తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆత్మవిశ్వాసం, పక్కా ప్రణాళిక, పట్టుదలతో చదివితే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. టైంటేబుల్ రూపొందించుకొని, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని శకుంతలాదేవి, ఉపాధ్యాయులు మంజులత, జయసాగర్, శ్రీరామలక్ష్మణ్, కృష్ణారెడ్డి, అంజయ్య, ఘనపురం దేవేందర్ పాల్గొన్నారు.

వంగరి త్రివేణికి నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం

డిచ్‌పల్లి, నవంబర్ 14 : పుస్తక ప్రేమికుడు, సాహితీవేత్త, అనువాదకుడు, మానవతామూర్తి నిజాం వెంకటేశం పేరుపై స్మారక సాహిత్య పురస్కారాలను ప్రదానం చేయాలని కమిటీ నిర్ణయించింది. ఉత్తమ సాహితీ విమర్శను, వర్తమాన, సాహితీకారులను, సామాజిక స్పృహగల పుస్తకాలను ప్రోత్సహించడానికి అవార్డులను అందజేయాలన్న ఉద్దేశంతో ఆయన జయంతి రోజున మొదటిసారిగా ఐదుగురు సాహితీకారులకు ఈ పురస్కారాలను అందజేశారు. హైదరాబాద్‌లోని పద్మారావు నగర్‌లోని బెల్వెడేరా హాలులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో టీయూలోని మానవీయ కళల విభాగం పీఠాధిపతి, తెలుగు అధ్యయనశాఖ పార్యప్రణాళిక సంఘ చైర్‌పర్సన్ వంగరి త్రివేణికి పురస్కారాన్ని కమిటీ ప్రతినిధులు అందజేశారు. వంగరి త్రివేణి రాసిన భరిణ (స్త్రీల సాహిత్య వ్యాస సంపుటి) పుస్తకానికి పురస్కారాన్ని అందజేశారు. ఆమెను ప్రముఖ సామాజిక సాహితీవేత్త, తొలి బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్. రాములుతోపాటు పలువురు అభినందించారు.

కార్ల షోరూంలో చోరీ

లాకర్లను చెత్తకుప్పలోదాచి ఉంచిన దొంగలు

డిచ్‌పల్లి, నవంబర్ 14 : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడ్పల్లి శివారులో ఉన్న మహేంద్ర కార్ల షోరూంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షోరూంలోకి దొంగలు చొరబడి రెండు లాకర్లను ఎత్తుకెళ్లి, షోరూం వెనుక భాగంలో ఉన్న చెత్తకుప్పలో దాచి ఉంచారు. పెద్దలాకర్‌ను పగులగొట్టేందుకు యత్నించినా అది తెరుచుకోలేదు. చిన్నలాకర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రూ. 82 వేల నగదును దోచుకెళ్లారు. చోరీ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న షోరూం యజమాని సాయినాథ్.. డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ కృష్ణ చేరుకొని డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో వివరాలను సేకరించారు. షోరూం వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలించి, షోరూం వెనుకభాగంలో ఉన్న చెత్తకుప్పలో లాకర్లను దాచినట్లు గుర్తించారు. పెద్దలాకర్‌ను పోలీసులు తెరవడంతో రూ. 4 లక్షల 80 వేలు అలాగే ఉండడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నది. ఆ డబ్బులను పోలీసులు షోరూం యజమానికి అప్పగించారు. చిన్నలాకర్‌లో ఉన్న రూ. 82 వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.